క్లుప్తంగా

వీరజవాన్లను గుర్తుంచుకోవాలి



జాతీయ జెండాలతో ర్యాలీ చేస్తున్న యువత

చీపురుపల్లి: దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన వీర జవాన్లను దేశ ప్రజలు నిరంతరం గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ అన్నారు. పట్టణంలోని జి.వి.ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఇండియన్ ఆర్మీ డేను ఆదివారం నిర్వహించారు. యువత జాతీయ జెండాలు ప్రదర్శిస్తూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా రెడ్డి రమణ మాట్లాడుతూ యువత దేశ రక్షణ కోసం ఆర్మీలో చేరాలని కోరారు. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన జవాన్లకు జోహార్లు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో హేమంత్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

రైతువాణి క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు

వేపాడ: ఏపీ రైతు సంఘానికి సంబంధించిన రైతువాణి క్యాలెండర్, డైరీను ఆ సంఘం జిల్లా కార్యదర్శి చల్లా జగన్ ఆధ్వర్యంలో డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరాము నాయుడు నీలకంఠరాజపురంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట చినరామునాయుడు మాట్లాడుతూ సాగు సలహాలు, సూచనలతో రైతులకు ఉపయోగపడే విధంగా సంఘ సభ్యులు క్యాలెండర్ రూపొందించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో బి.రాంబాబు, ఉప సర్పంచ్ కండిపల్లి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుబాబు పుట్టినరోజు వేడుకలు



నాయుడుబాబును సత్కరిస్తున్న వేపాడ,ఎల్.కోట మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తవలస: రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు పుట్టినరోజు వేడుకలను ఆయన స్వగ్రామం రామలింగాపురంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు,అభిమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎస్.కోట నియోజకవర్గం పరిధిలోని అయిదు మండలాల్లోని ముఖ్య నాయకులు, అభిమానులతో పాటు అనకాపల్లి జిల్లా కొటపాడు, దేవరాపల్లి మండలాలకు చెందిన అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్సాహంగా సంగిడీ రాళ్లు ఎత్తే పోటీలు



అంబటివలసలో సంగిడీరాయి ఎత్తుతున్న యువకుడు

బొండపల్లి: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని అంబటివలస గ్రామంలో సోమవారం జిల్లాస్థాయి సంగిడీ రాళ్లు ఎత్తే పోటీలు నిర్వహించారు. సుమారు 100 మంది గ్రామీణ యువకుడు 100-150 కేజీల రాళ్లను ఒంటిచేత్తో ఎత్తి బలప్రదర్శన చూపారు. విజేతలకు మంగళవారం నగదు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

అపరాల పంటకు మంచు ఎఫెక్ట్



బొండపల్లి సమీపంలో అపరాల పంటపై కురుస్తున్న మంచు

బొండపల్లి: నాలుగు రోజులుగా కురుస్తున్న పొగమంచు కారణంగా అపరాల పంటకు తీవ్రనష్టం వాటిల్లుతోందని గజపతినగరం సబ్‌డివిజన్ పరిధి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలోని బొండపల్లి, గజపతినగరం, మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లో సుమారు 13,450 ఎకరాల్లో ప్రస్తుతం పెసర,మినుము పంటలు సాగు చేస్తున్నారు. పంట చేను బాగా ఉన్నప్పటికీ పొగమంచు కారణంగా పూత ,పిందె నల్లగా మాడిపోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూత రాలిపోతోందని రైతులు చెబుతున్నారు.



గుర్ల: దమరసింగిలో మహిళల కోలాటం



గుర్ల: గూడెంలో గోమాతకు పూజలు చేస్తున్న వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు దంపతులు



వేపాడ: నీలకంఠరాజపురంలో నిర్వహించిన వేడుకలకు ఎడ్లబండిపై వస్తున్న డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు



జామి: వెన్నె గ్రామంలో భోజనాలు చేస్తున్న గ్రామస్తులు,పెద్దలు



దత్తిరాజేరు: పాలవలసలో నృత్యాలు చేస్తున్న బాలికలు



చీపురుపల్లి: కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద గోపూజ చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఇప్పిలి గోవింద,సూరు కుమార్



వేపాడ: నీలకంఠరాజపురంలో డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు నేతృత్వంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు

ఇంటింటా వేడుక...
ఊరంతా ఉల్లాసం

తెలుగు వారి పెద్ద పండగ సంక్రాంతి సంబరాలు పల్లెల్లో అంబరాన్నంటాయి. వలసలు వెళ్లిన వారితో పాటు కొత్త అల్లుళ్లు, ఆడపడుచుల రాకతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఆదివారం సంక్రాంతి, సోమవారం కనుమ పండగను ప్రజలు వైభవంగా నిర్వహించారు. మహిళలు ఇళ్ల ముందు రంగవల్లులు వేసి గొబ్బెమ్మలను అలంకరించారు. హరిదాసులు కీర్తనలు ఆలపించగా.. మరోవైపు డూడూ బసవన్నల విన్యాసాలు కనువిందు చేశాయి. సంక్రాంతి రోజున ఇంటిల్లపాది నూతన వస్త్రాలు దరించి పూజలు చేసిన అనంతరం పితృ దేవతలకు తర్పణాలు ఇచ్చారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. పలు గ్రామాల్లో యువత ఆధ్వర్యంలో ముగ్గులు, డ్యాన్స్, క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. చిన్నారులు పతంగులు ఎగురవేస్తూ సందడి చేశారు. కనుమ రోజున రైతులు పశువులకు పూజలు చేశారు. చీపురుపల్లి పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో దేవదాయ ధర్మాదాయశాఖ నేతృత్వంలో గోపూజోత్సవం నిర్వహించారు.

– సాక్షినెట్ వర్క్



గజపతినగరం: గజపతినగరంలో డూడూ బసవన్నల సందడి



బొండపల్లి: పశువులకు పూజలు చేస్తున్న చిన్నారులు, రైతు



వేపాడ: నీలకంఠరాజపురంలో గంగిరెద్దును ఆడిస్తున్న కళాకారులు



చీపురుపల్లి: జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష నివాసం వద్ద గోపూజ

వైభవంగా సీతారామచంద్రస్వామి తీర్థం

లక్కవరపుకోట: మండలంలోని శ్రీరాంపురం గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం వద్ద గ్రామ పెద్దల సమక్షంలో స్వామివారి తీర్థమహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఏటా కనుమ పండగరోజు ఈ తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామ పెద్దలు చెబుతున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనానికి సోమవారం ఉదయం నుంచే భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు. అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులతో విశేష పూజలు చేయించారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు



పూజలు అందుకుంటున్న సీతారామచంద్రస్వామి

చేసిన తప్పెట గుళ్లు, చిడతల భజన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

విజేతలకు బహుమతుల ప్రదానం



గజపతినగరం రూరల్: విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తున్న జెడ్పీటీసీ తవుడు, తదితరులు



దత్తిరాజేరు: విజేతలకు బహుమతులు అంతచేస్తున్న మాజీ ఎంపీపీ తిరుపతినాయుడు

గజపతినగరం రూరల్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని ముచ్చర్ల గ్రామంలో అన్నదమ్ములు సత్తారు మురళీ, ప్రతాప్ రంగవల్లులు, పరుగుపందెం, డ్యాన్స్ పోటీలు ఆదివారం నిర్వహించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రిఫ్రిజిరేటర్, గ్రైండర్, మిక్సీలతో పాటు నగదు బహుమతులను అందజేశారు. అతిథిగా జెడ్పీటీసీ గార తవుడు హాజరయ్యారు.

ఎస్.చింతలవలసలో..

దత్తిరాజేరు: సంక్రాంతి సందర్భంగా మండలంలోని ఎస్.చింతలవలసలో మాజీ ఎంపీపీ కంది తిరుపతి నాయుడు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు తిరుపతినాయుడు బహుమతులు అందజేశారు.

ఆకట్టుకున్న ఎడ్ల పరుగు ప్రదర్శన



పోటీల్లో పరుగు తీస్తున్న ఎడ్లు

వేపాడ: మండలంలోని కృష్ణారాయుడుపేట గ్రామంలో కృష్ణరాయుడు తీర్థమహోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శ న ఆకట్టుకుంది. పోటీల్లో అనకాపల్లి, విజయనగరం జిల్లాలకు చెందిన 16 జతల ఎడ్లు పాల్గొనగా వల్లంపూడికి చెందిన ఏడువాక సత్తిబాబు ఎడ్లు విజేతగా నిలిచాయి. ద్వితీయ, తృతీయ స్థానాల్లో అనకాపల్లి జిల్లా చెందిన నరసయ్యపేటకు చెందిన ముమ్మన రామకృష్ణ, లెక్కలవానిపాలెంకు చెందిన లెక్కల సత్తిబాబు ఎడ్లు నిలిచాయి. విజేతలకు నిర్వాహకులు ప్రథమ బహుమతిగా రూ.12 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు, తృతీయ బహుమతిగా రూ.8 వేలు అందజేశారు. తీర్థం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఆర్థిక సహాయం

వేపాడ: స్థానిక ఉన్నత పాఠశాలలో 1984లో పదోతరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు తమ బ్యాచ్‌కు చెందిన మిత్రుల్లో ఆపదలో ఉన్న రెండు కుటుంబాలకు ఆర్థిక సహాయం చేశారు. తమ మిత్రుడు వేపాడ గ్రామస్తుడు బండారు సూర్యనారాయణ కుమారుడు దివ్యాంగుడు కావడంతో రూ.15 వేలు అందజేశారు. అలాగే మరో మిత్రుడు వేపాడకి చెందిన ఆదపురెడ్డి ఈశ్వరరావు భార్య క్యాన్సర్‌తో బాధపడుతుండడంతో వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15 వేలు సహాయం చేశారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు మాట్లాడుతూ తమతో కలిసి చదువుకున్న



తోటి మిత్రుడి కుమారుడు దివ్యాంగుడికి నగదు అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

మిత్రుల్లో కష్టాల్లో ఉన్నవారికి అంతా అండగా ఉండాలని నిర్ణయించుకున్నామని చెప్పారు.

నేడు సోమలింగాపురానికి మంత్రి బొత్స రాక

మెరకముడిదాం: రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ మండలంలోని సోమలింగాపురానికి మంగళవారం రానున్నారని ఎంపీటీసీ ఎస్.సీతారామరాజు, నాయకులు ఎస్.కృష్ణమూర్తిరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏటా సంక్రాంతి పండగకు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు ఇంటికి మంత్రి బొత్స వచ్చి ఆతిథ్యం స్వీకరిస్తారని, ఈ ఏడాది కూడా మంత్రి వస్తున్నారని పేర్కొన్నారు.

నేడు అమ్మవార్ల తీర్థ మహోత్సవం

జామి: మండలంలోని ఎం.కె.వలస గ్రామంలో కన్నమ్మతల్లి, శిరికిపాలెంలో కొత్తమ్మ తల్లి, చింతాడలో మల్లికార్జునస్వామి తీర్థమహోత్సవాలు మంగళవారం నిర్వహించనున్నట్లు ఆయా గ్రామాల పెద్దలు సోమవారం తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామని, అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

మంచు దుప్పటి..



గజపతినగరం జాతీయ రహదారిలో ఉదయం 8 :30 గంటల సమయంలో కురుస్తున్న మంచు

గజపతినగరం: మండలాన్ని ఆది, సోమవారం మంచుదుప్పటి కప్పేసింది. ఉదయం 8 : 30 గంటలు దాటినా దట్టమైన పొగమంచు కురుస్తునే ఉంది. గజపతినగరంలో జాతీయ రహదారి మీదుగా రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. వాహనాలకు పట్ట పగలే లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించాల్సి వచ్చింది.

దుస్తుల పంపిణీ



గజపతినగరంరూరల్: కెంగువలో దుస్తులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసరావు



మెరకముడిదాం: ఉత్తరావల్లిలో రగ్గులు, కండువాలు, స్టీలు గ్లాసులు పంపిణీ చేస్తున్న వర్మరాజు, మాజీ సర్పంచ్ సత్యనారాయణ



గుర్ల: మణ్యపురిపేటలో చీరలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ హైమావతి, వెంకటరమణ దంపతులు



చీపురుపల్లిరూరల్: ఇటకర్లపల్లిలో గ్రామస్తులకు తువ్వాళ్లు పంపిణీ చేస్తున్న అప్పలనాయుడు



శృంగవరపుకోట: కృష్ణాపురంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

గజపతినగరం రూరల్: సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండలంలోని కెంగువ గ్రామంలో స్థానికుడు, మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు లెంక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుమారు 300 మంది పేదలకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా సంక్రాంతి రోజున గ్రామంలోని పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు గణేష్, సర్పంచ్ కొండల సూరప్పడు తదితరులు పాల్గొన్నారు

ఉత్తరావల్లి గ్రామంలో...

మెరకముడిదాం: ఉత్తరావల్లి గ్రామంలో చింతలపాటి వర్మరాజు తన తండ్రి సూర్యనారాయణరాజు జ్ఞాపకార్థం 60 కుటుంబాలకు రగ్గులు, కండువాలు, స్టీలు గ్లాసులు సోమవారం పంపిణీ చేశారు. అతిథిగా హాజరైన మాజీ సర్పంచ్ మండల సత్యనారాయణ మాట్లాడుతూ పేదలకు ఏదో ఒకరూపంలో సహాయం అందించడం అభినందనీయమని అన్నారు. దాత వర్మరాజు స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైనంతలో సేవాకార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో తిరుమలరాజు వేణుగోపాలరాజు, దామర పెదబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇటకర్లపల్లిలో..

చీపురుపల్లిరూరల్: మండలంలోని ఇటకర్లపల్లి గ్రామంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ మీసాల అప్పలనాయుడు గ్రామంలో 200 మందికి ఆదివారం తువ్వాళ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగను పురష్కరించుకొని రైతన్నలకు తువ్వాళ్లు అందజేశామని చెప్పారు.

మణ్యపురిపేటలో..

గుర్ల: మండలంలోని మణ్యపురిపేటలో సర్పంచ్ బడుగంటి హైమావతి, వెంకటరమణ దంపతులకు 90 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

కృష్ణాపురంలో..

శృంగవరపుకోట: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో షిరిడీ సాయి కమిటీ ఆధ్వర్యంలో 100 మంది పేదలకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. షిరిడీ సాయి కమిటీ అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు, సభ్యులు ఎస్.శ్రీనివాసరావు, వి.ఈశ్వరరావు, కె.తాతారావు, వి.హరగోపాల్, సన్యాసప్పడు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో కర్లాం

చీపురుపల్లి: మండలంలోని కర్లాం పంచాయతీ అభివృద్ధి పథంలో పయనిస్తోంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నడూ లేనంతగా కర్లాం పంచాయతీలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. గ్రామంలో రూ.40 లక్షలతో గ్రామ సచివాలయ భవనం, రూ.21.8 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.15.74 లక్షలతో బల్క్ మిల్క్ కూలింగ్ కేంద్రం, రూ.50 లక్షలతో 500 టన్నుల సామర్థ్యం గల గొడౌన్ నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయి. ఈ భవనాలన్నీ ఒకే చోట నిర్మించారు. వీటికి విజయనగరం ఎంపీ నిధులు రూ.10 లక్షలతో ప్రహరీ కూడా నిర్మించారు. త్వరలో ఈ భవనాలను ప్రారంభించనున్నారు.



రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం



రూ.21.8 లక్షలతో నిర్మిస్తున్న రైతుభరోసా కేంద్రం



భవన సముదాయాలకు నిర్మించిన ప్రహరీ